మా నాగాయి వాళ్ల నాటకబృందం రైలు దిగేటప్పటికి సాయంత్రం నాలుగు గంటలయింది నాగాయి లాయరు పరీక్ష ప్యాసయి వూళ్లో బోర్డు తగిలించినా నాటకాలమీద వ్యామోహం వదల్లేక ఒక ఎమెచ్యూర్స్ కంపెనీ ఒద్ధంవేశాడు వాడితండ్రి నాటకాల్లో తిరిగి కొంత పేరు తెచ్చుకున్నమాట నిజమే కాని అందువల్లనే ఆయన పిత్రార్జితం కూడా దాదాపు హరించుకుపోయింది నాగాయికి చిన్నప్పటినుంచే నాటకాల పిచ్చి వుండటంచూసి పుట్టుకతోనే వాడికి నాటకాల రక్తం వచ్చిందని గ్రహించి వాడి జీవితం నాటకీకరణం కాకుండా పట్టుబట్టి వాడిని లాయరు చేశాడు తండ్రి

అదేం తమాషో మనవాళ్ళు తమ జీవితంలో ఒకటి ప్రారంభించి కొడుకులకు ఇంకో దారిచూపుతారు తండ్రి వ్యవసాయంచేస్తే కొడుకు ప్లీడరు మనవడు వ్యాపారం తండ్రి వ్యాపారంచేస్తే కొడుకు మేస్టరు మనవడు డాక్టరు అలా మారుతూ వస్తున్నాయి జీవితాలు చిత్రం ఏ వృత్తుల్లో వాళ్ళకు తమ వృత్తులకన్న ఇతర వృత్తులే ఆకర్షణీయంగా లాభకరంగా వుంటాయి ఎప్పుడూ। దీనిక్కారణం బహుశా ఒకప్పటి వృత్తులే తర్వాత కులాలుగా మారిపోవటం ఎక్కువ తక్కువలు ఏర్పడటం కావచ్చు కాని ఇప్పుడు ఒక



కూతురు

కొడవటిగంటి కృష్ణమూర్తి

కులంవాళ్ళు ఏ ఇతర వృత్తి అవలంబించినా కులంమటుకు మారదు! పెద్ద కులాలవాళ్లు నీచవృత్తి చేసినా ఫర్వా లేదు కాని తక్కువ కులాలవాళ్ళు గొప్ప పన్లుచేసినా, యోగ్యులైనా ఫర్వా వుంటుంది కామాలు!

ఎమెచ్యూర్స్ కంపెనీ ప్రారంభించటానికి నాగాయి చాలా అవస్థపడ్డాడు. సినిమా యుగం వచ్చింతర్వాత నాటకాల స్థితి దిగనాసి పోయింది. నాటకాలతో దీపాలార్పుకున్నవాళ్ళు కొల్లలుగా వుండటం కూడా ఓ పెద్ద చిక్కయింది. అందుకని నాటకాలాడటమే జీవనోపాధి, వృత్తి కారాదని నాగాయి ప్రచారం చేశాడు వూళ్ళో. ఉబలాటంగా వున్న వాళ్ళకు నాటకాలవల్ల నష్టమేమీ లేకుండా వుంటే చాలదా అని ప్రశ్నించాడు. ఇన్ని సినిమాలున్నా నాటకాలు చూడటానికి ఎంతో మోజుపడే ఎంతో మంది గతి ఏమిటి అని ప్రశ్నించాడు. మన నాటక కళకు తిలోదకాలు ఇచ్చేసినట్టేనా అని సవాలు చేశాడు. నాటకాలాడటంవల్ల ఏవిధమైన ఇబ్బంది కలగకుండాను, నాటకాలాడే వారిని ఎవ్వరూ 'చిన్న చూపు' చూడకుండాను మార్గంకూడా సూచించాడు. నాటకాల తహతహ ఇగిరి పోతున్న కొందరికి రైలు పూర్తిగా ఆగిపోయినట్లయింది. ఎమెచ్యూర్స్ కంపెనీ అవతరించింది!

నాటకబృందం ఏర్పడటానికి మొదట్లో చాలా పేచీలు వచ్చాయి. నాగాయి పెట్టుబడి పెడతానన్నాడు. లాభంవస్తే నాటక బృందం అభివృద్ధికి వినియోగించాలి. నష్టం వస్తే అది నాగాయిది. నాగాయి అన్నిటికీ సంసిద్ధం కావటం చూసి మొదట్లో వాడిని నమ్మని వాళ్ళు ముందుకు వచ్చారు. అంతా దాదాపుగా సమానవాటాలు వేసుకుని నాటక సమాజానికి నాంది పలికించారు. నాటక బృందంలో మేస్టర్లు వున్నారు, గుమాస్తాలు వున్నారు, లాయర్లు వున్నారు. ఎవ్వరూ నాటకాలమీద ఆధార పడినవాళ్ళుకాదు. అందరికీ నాటకాలంటే అమితసరదా. నాటకాల్లో పాల్గొని బాముకునే దేమీ లేకపోయినా అందరికీ ఏదో ఆత్మసంతృప్తి!

ప్రారంభించిన వేళావిశేష మంటాడు నాగాయి, కాదు ప్రారంభించిన పద్ధతి అంటారు కొందరు. ఏమయినా నాగాయి బృందం లాభ నష్టాలు లేకుండా సాగి పోయింది. వాళ్ళ ఉత్సాహం చిలవలూ, పలవలూ వేసింది. అందరికీ ఏవో వృత్తులుండటంవల్ల సెలవరోజుల్లో తప్ప నాటకా లాడ్డానికి వీలుకాలేదు. అందు చేత మొదట్లో స్వంతవూళ్లోను, తర్వాత చుట్టుపక్కల పల్లెటూళ్ళలోను ప్రదర్శించారు. నాటకశాల లన్నీ సినిమాహాలు లయిపోవటంవల్ల పీలైన సావిళ్ళలో,

తాత్కాలికంగా తయారుచేసిన ఎందిళ్లలో స్కూళ్ళహాలుల్లో ప్రదర్శనలు కొనసాగించారు

కొంత అనుభవం అయింతర్వాత నాగాయి ఓ కవికుమారుడిలాంటి వాడిని దువ్వి, ఓ నాటకం తయారు చేయించాడు భావాలన్నీ నాగాయి వయినా పేరు కవికుమారుడిది నాటకాన్ని చక్కగా తర్ఫీదు చేయించాడు నాటకాన్ని నిర్విఘ్నంగా, జయప్రదంగా ప్రదర్శించటమే ప్రధానోద్దేశ్యమని ప్రతిసారీ జ్ఞాపకం చేసుకురావటంతో నాటకకళాకారుల మధ్య సహజంగా పైకి వుబికే తగాదాలు, వ్యక్తిత్వాలు, పేచీలు తగ్గించుకోగలిగారు ప్రదర్శన సమయంలో ఒకరిని మించాలని మరిఒకరు పోటీపడటం కాక ఆయా పాత్రధారుల ప్రతిభ, నాటకంలో భావాలు బైటపడేటట్టు సహకరించుకోవటం అతి ముఖ్యమని, నాగాయి తనబృందంవారికి నూరిపోశాడు ఓ నాటక పోటీ లో పాల్గొంటే వారి ఉదతా భక్తికి ప్రతిఫలంగా మొదటిబహుమతి వచ్చింది నాగాయి బృందానికి ప్రోత్సాహమియ్యటానికి ఇప్పు డీ వూరివాళ్ళే వాళ్ళ నాహ్వానించారు '

సామానులు వగైరాతో కొందరు పొద్దునే వచ్చేశారు ఇప్పుడు మిగిలిన వాళ్ళు, నాగాయి వచ్చారు వారికి స్వాగతమియ్యటానికి వచ్చిన శ్రేయోభిలాషులవద్ద సెలవుతీసుకుని నాగాయి కొందర్ని హాలువద్దకు, మరికొందర్ని బసకు పంపి తను వెంకమ్మ హోటలుకు బైలుదేరాడు.

ఎప్పటి వెంకమ్మ హోటలు — ఎప్పటి కథ ' — ఎనిమిదేళ్ళ క్రిందట నాగాయి ఈ వూళ్ళో కాలేజీలో చదివే నాటి సంగతి అప్పటికి నాగాయి వూళ్లో స్కూలు కాలేజీ కాలేదు అందుకని నాగాయి కాలేజీ చదువుకోసం ఈ వూరు వచ్చాడు ఆ హోటలుకూ, ఈ హోటలుకూ తిరిగి చివరకు వెంకమ్మ హోటలు కనిపించాకగా వాడు మరెక్కడికీ పోక బి ఏ. వరకూ నాలుగేళ్ళ చదువూ పూర్తి చేసింది' వెంకమ్మగారు మెరుగులు, నగిషీలుపెట్టని బంగారంలాంటిది చాలా ఘనకార్యాలు చెయ్యవలసిన వ్యక్తి, ఆడది అయిపోయింది గాని —

వెంకమ్మతండ్రికి వరసగా ముగ్గురు ఆడపిల్లలుపుట్టి ఆయనకు జీవితంలో చాలా నిరుత్సాహం కలిగించారు. అసలే గర్భదరిద్రుడు ఇక ఆడపిల్లలకు కట్నాలూ కానుకలూపోసి పెళ్ళిళ్ళు కూడా ఎక్కడ చేయించగలడు? కట్నం తీసుకోకుండా ఆడపిల్లని పెళ్ళి చేసుకోవాలనే తెలివితక్కువవాళ్ళుంటారా ఎక్కడైనా? ఒకవేళ వున్నా వాళ్ళొట్టి మూఢులని తేలుస్తుంది ఆధునికనాగరికత! అలాంటి మూఢత్వానికి కూడా అంగీక

రించే మొగవాళ్ళున్నా కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేయించే స్తోమతే లేదు వెంకమ్మ తండ్రికి. మూడోసారి ఆడపిల్ల కలిగే టప్పటికి వెంకమ్మ తండ్రికి ఒక చెంప పిల్లలంటే మొహం మొత్తింది - మరో చెంప మగపిల్లవాడు లేడే అనే విచారం ఎక్కువైంది! ఆడపిల్లలు తల్లిదండ్రులకు అన్నివిధాలా ఖర్చు కలిగించి, చివరకు మరోగడపతొక్కి ఇంటిపేరు కూడా మార్చుకుంటారు. మొగపిల్లవాడయితే వంశోద్ధారకుడవుతాడు. మరి తద్దినాలు పెడతాడు. ఒకవేళ పెట్టక పోయినా పెద్దవాడయి ఏదోకొంత సంపాదించి వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఎంతోంత పోషిస్తాడు. కనీసం ఆ ఆశ ఆయినా వుంటుంది! అందుకనే కామాలు ఆస్తి లేనివాళ్ళయినా మొగపిల్లవాడినే పెంచుకుంటారు. కాని ఆస్తి వున్నా లేక పోయినా తాము పెంచుకున్న పరాయివాడు నిజంగా తమ వంశోద్ధారకుడు ఎలా అవుతాడు ? కనక పెంచుకోవటం వృద్ధాప్యంలో ఆదుకోటానికే కావాలి!

పుట్టిన పిల్లల్ని ఎలా పోషించటమూ అని నానా అగచాట్లు పడుతుండగా వెంకమ్మ తల్లి మళ్ళీ గర్భవతి అయింది. ఈసారైనా మగపిల్లవాడు పుట్టడా అన్న ఆశ, మరో ఆడపిల్ల పుడితే గతేమిటి అన్నభయం మధ్య వెంకమ్మ తండ్రి హూనం అయినాడు. తన జాతకమూ, భార్య జాతకమూ తిరగేయించాడు - బోర్లవేయించాడుకూడా! కాని ఫలానా పిల్లఅని ఎవ్వరూ కచ్చితంగా చెప్పలేక పోయారు. ఒకవేళ కచ్చితంగా ఆడపిల్ల పుడుతుందని ఎవరేనా చెప్పితే ఆయన ఏంచేశేవాడో చెప్పలేం! అసలే సరైన పోషణలేక కాన్పులమీద కాన్పులు రావటంవల్ల వెంకమ్మతల్లి చాలా నీరసించిపోయింది. ఆపైన కొత్త కడుపు! పుట్టబోయే పిల్ల సంగతి దేముడెరుగు, అసలు తల్లి ప్రాణానికే మోసంవస్తుందేమో అని చాలామంది భయపడ్డారు. భార్యకింత ఘోరవిపత్తు తెచ్చిపెట్టాడని వెంకమ్మతండ్రిని ఎవరూ పైకి అన లేదుకాని ఆ శుభ సమయంలో ఎవ్వరూ ఆయనపట్ల సంతోషం ప్రకటించలేదు!

వెంకమ్మ సజీవంగా పుట్టటం అర్ధశత బంధువుల్లో ఎవ్వరికీ ఇష్టం లేదు. కాకులూ, గద్దలూ, కుక్కలూ, పందులూ పాములూ, చీమలవల్ల ఒక సమయాన కాకపోతే మరో సమయంలో ఏదైనా ప్రయోజనం వుంటుందేమోకాని వెంకమ్మ వల్ల ఏ ప్రయోజనమూ వుండేటట్టు ఎవ్వరికీ తోచలేదు. సరైన తిండిలేక నిస్సత్తువతో అనారోగ్యం అభివృద్ధి అయ్యే కుటుంబంలో మరో అనారోగ్యమైన అనాకారి ఆడపిల్ల ఉద్భవించటం ఎంత ధైర్యవంతుణ్ణి అయినా చిత్తుచేస్తుంది. అదృష్టవశాత్తు వెంకమ్మ తండ్రికి ధైర్యం లేదు:

"మీ లోకం వదిలినా, ఇంకా మా వెంట పడుతున్నారూ!"

వెంకమ్మ అనారోగ్యం పురుట్లోనే పీకలమీదికి తెచ్చింది. చావు బతుకుల మీదికి వచ్చిన భార్యనూ, పిల్లనూచూసి వెంకమ్మ తండ్రికి పిచ్చాసుపత్రి ప్రవేశం మినహా ఆ లక్షణాలన్నీ సంప్రాప్తించాయి. నయం అయినా కాకపోయినా భార్యకు, పిల్లకు మందు లిప్పించే తాహతులేదు. తల్లికి పాలులేవు. కాని పిల్ల పాలుతాగే స్థితిలోలేకపోవటం ఒక్కటే సుగుణం – దేముడు చేసిన మేలు! వెంకమ్మ తల్లి బతికింది!

ఎవ్వరూ మనసా వాచా కోరకుండానే వెంకమ్మకూడా బతికింది. జీవితం ప్రారంభించింది. పిల్లలు లేనివాళ్ళుకూడా వెంకమ్మను ఎత్తుకోవటానికి ఇష్టపడే వారు కాదు. పారాడగలిగేటంతవరకూ ఆవిడ వెంకమ్మతల్లికి ఏదో చుట్టమయిన కళ్ళులేని ఓ ముసలమ్మ చేతుల్లో పెరిగింది. పడుతూ, తలకూ మోకాళ్ళకూ తగిలే దెబ్బలతో నడవటం నేర్చుకుంది. వెంకమ్మ ముఖారవిందం తల్లిదండ్రులకే వికారం కలిగించేది. వెంకమ్మ అంటే తమకున్న రోతను వాళ్ళెప్పుడూ దాచిపెట్టలేదు. కన్న తలిదండ్రులకే అలా వుంటే మరొకరు వెంకమ్మను మరోలా ఎలా చూస్తారు – ఎందుకు చూస్తారు? చిన్నతనంలో ఆవిడ ఎక్కడికి వెళ్ళినా అడిగినవాళ్ళూ, విచారపడినవాళ్ళూ లేరు.

కాని దారితప్పి చెరువుగట్టున చాకిరేవుకో, గాడిభావిదగ్గిరకో, దేవాలయం మండపం దగ్గిరికో వెళ్ళితే ఎవరో అనవసరమైన శ్రద్ధతీసుకుని ఆవిడని ఇంటిదగ్గిర దిగ పెట్టి వెళ్ళేవాళ్ళు. ఆమె ఎవరిపిల్లో వూరందరికీ తెలుసు—ఆ వూళ్ళో అలాంటి పిల్ల మరొకరు లేందే! శకునాలు పాటించేవాళ్ళంతా వెంకమ్మకంటె పిల్లి నయమని ఏకగ్రీవంగా ఆమోదించారని ప్రతీతి!

ఎనిమిదో ఏడు వచ్చేసరికి వెంకమ్మకు శాస్త్రప్రకారం పెళ్ళిచెయ్యాలని తండ్రి నిశ్చయించాడు. కాని ఆమెకు వివాహం చెయ్యటం అసంభవ మయింది. క్రమంగా వెంకమ్మకు రజస్వల అయ్యే ఈడుకూడా వచ్చేసింది. ఆ రోజుల్లో రజస్వల అయిన పిల్లకు పెళ్ళిచేస్తే బాగా డబ్బున్నవాళ్ళయితే తప్ప, సంసారపక్షం వాళ్ళ నయినా బంధువర్గం, సంఘం వెలివేసి, బహిష్కరించేవాళ్ళు. ఇక వెంకమ్మ తండ్రి సంగతి వేరే చెప్పాలా! వెంకమ్మ తండ్రికి వెర్రెత్తినట్లయింది. ఇటు వెంకమ్మ తల్లి మళ్ళీ ప్రసవించే రోజులు—అటు వెంకమ్మ పెళ్ళి వెంటనే చేసి తీరాలి! ఆ సమయంలో దేముడు చేసిన మరో మేలు ఏమిటంటే ఏ సంఘం, ఏ బంధువర్గం వెంకమ్మకు రజస్వలానంతర వివాహం చేస్తే ఆమె తండ్రిని పచ్చడి చేశేవారో ఆ బంధువర్గమే, ఆ సంఘమే వెంకమ్మ వివాహ విషయంలో విచిత్రంగా సహాయపడడం. అన్ని విషయాల్లో వెంకమ్మకన్న రెండాకులు ఎకువ్క చదివిన ఓ నిర్భాగ్యుణ్ణి బంధుకోటిలో ఏరి ఆవిడకు అంటగట్టారు. ఎవ్వరికీ పనికిరాని వెంకమ్మ అతనికి అవసరమని శాసించారు. అతను కొంచెం పెద్దవాడు కావటంవల్ల "నాకీ పెళ్ళి వద్దో" అని ఎంత పోరుపెట్టినా వివాహం కానివాళ్ళు, భార్యలు లేనివాళ్ళు ఎలా దిక్కులేకుండా పోతారో ఉదాహరణలు చూపించారు. ఏ కాలో, చెయ్యో విరిగితే ఎవరు చేస్తారనీ, అవసరమైతే అలా విరగ్గొట్టి చూపగలమనీ తేల్చారు. పెళ్ళి అంపకాలప్పుడు మాత్రం ఆమెతల్లీ, తండ్రీ అనుకోకుండానే కళ్ళు తుడుచుకున్నారుట. అర్థి ఏ తల్లిదండ్రులూ తప్పించుకోలేరు—కనీసం వెంకమ్మ తండ్రికయినా సాధ్యం కాలేదు!

వెంకమ్మ జీవితంలో మరో ప్రకరణం ప్రారంభమయింది. మొదటినుంచీ వెంకమ్మ ఎవ్వరికీ అక్కర్లేక పోయిందని ఆమె భర్త గ్రహించాడు. ఆమెకు యుక్తవయస్సు రాగానే ఏలుకోటానికి సుతలామూ నిరాకరించాడు. తనను బెదిరించి, బలవంతంగా ఆ పెళ్ళి చేశారనీ. ఆమెను భార్యగా స్వీకరించాలిసిన బాధ్యత తనకులేదనీ అతను చెప్పటమే కాక మనఃపూర్తిగా నమ్మాడు! భార్యను

ఏలుకోన్నీ భర్తను శిక్షించాలని, కనీసం వెలివెయ్యాలని బంధువర్గంలో, సంఘంలో నియమాలు లేవుగా! బహిష్కరిద్దామన్నా వెంకమ్మ భర్త ఆమె బంధువు! ఆమెను నిరాకరించటానికి అతనికి ఇంకో కారణంకూడా తోడైంది. ఎవర్ని చూసినా అతనిభార్యకంటె అందమైన వాళ్లే. తను భాగ్యవంతుడు కాకపోవచ్చు. రూపసి కాకపోవచ్చు - కాని అందమైన ఆడవాళ్ళను వాంఛించటానికి ఎవరి అనుజ్ఞ అక్కర్లేదుగా! కోరికలు వృద్ధి చేసుకునే వాళ్ళంతా అర్హులయ్యేనా ఏమిటి కోరికల్ని పూరించుకోవటం! చివరకు, అందంలేకపోయినా అంగసౌష్టవం కల వాళ్ళను ("వొంపులు" అనేది అక్షరాలా తర్జుమాపదం-ఆ కాలంలో వాడుకలో లేదు) అతను ఆశ్రయించాడు. ఏ కాడి నాకైకక్కుర్తిపడే స్థితికి రావలిసివచ్చిన వనితల్ని మరిగాడు. వెంకమ్మకు దూరం అయినాడు. చివరకు కనిపించకుండాకూడా పోయినాడు. అత నెక్కడికి వెళ్ళిందీ, ఏమయిందీ ఎవ్వరికీ తెలియదు. రోగాలతో తీసుకుని చచ్చిపోయి వుంటాడని కొందరు తేల్చారు. ఎవత్తె కోసమోపోతే చంపేశారని కొందరు పుకారు పుట్టించారు. నిజం ఎవ్వరికీ తెలియదు. కాలక్రమాన వెంకమ్మకు మిగిలిందల్లా భర్తలేని పునిస్త్రీతనమూ, భర్తతాలూకు యాభై సెంట్ల భూమీ, విశాలప్రపంచమూ!

వెంకమ్మ భర్త వొట్టి పరమ నిర్భాగ్యుడని తేల్చారు. మరి వెంకమ్మ చాలా సౌమ్యురాలు. మాట పొల్లురానీయదు. మీదుమిక్కిలి ఎంత చాకిరైనా విసుక్కోకుండా, చక్కగా చేస్తుంది. ఒక్క వెంకమ్మ వుంటే పనికి ఇంకెవ్వరూ అక్కర్లా! పిల్లల్ని కూడా ఎత్తుకు తిప్పుతుంది. వెంకమ్మ అందరి పనులకూ కావలిసి రావటంవల్ల ఆమె విషయంలో అసూయలు, స్పర్ధలు రేగినమాట నిజం. ఏ వెంకమ్మ అయితే మాత్రం ఒకేసారి అందరి పనులూ ఎలా చేస్తుందేం అని అందరూ వాదించారు. కాని "మా" ఇంట్లో పనిచెయ్యాలని అందరూ పట్టుపట్టే వాళ్ళు. ఆమె చేత పనిచేయించుకోవటమే ఆమెపట్ల ఎవరైనా చూపగలిగిన సానుభూతి!

అక్షరజ్ఞానంలేని వెంకమ్మ చచ్చేటంతవరకూ ఈవిధంగా జీవించాలిసిన పరిస్థితి ఏర్పడ్డది. ఈ పరిస్థితిని ఆమె తండ్రి ఒక సమస్యగాచేశాడు. అంతవరకూ తండ్రిఇంట్లో వుంటూ వచ్చిన వెంకమ్మను ఒకనాడు ఆమెతండ్రి ఆమె భర్తతాలూకు యాభై సెంట్ల పొలమూ తనపేర పెడితే ఆవిడ తిండి కేలోపమూ వుండదని సలహా ఇచ్చాడు. ఆ సలహా వెంకమ్మ కెందుకో

మనస్కరించలేదు. బంధువులయినా, ఇతరులైనా ఆమెచేత అడ్డమైచాకిరీ చేయించుకుని ఇంత తిండి పెట్టటం ఆనవాయితీగానే వుంటోంది. ఆ పొలంమీద వచ్చే ఆదాయాన్ని తండ్రే వాడుతున్నాడు. ఆవిడకైనా - ఎవరికైనా! అటువంటప్పుడు ఆ పొలం తనపేర పెట్టమని తండ్రి ఆమె నెందుకు నిర్బంధించాలో ఆమెకు అర్ధంకాలేదు. వెంకమ్మ పెద్దఅక్కయ్య ఏళ్ళ మట్టీ భర్తకు తెలియకుండా పేర్చుతూ వచ్చిన రెండు వందల రూపాయలనూ తండ్రి దగ్గిర దాచిపెట్టి ఓసారి అడిగితే, రెండు కిత్తాల్లో మొత్తం పదిరూపాయలిచ్చి వూరుకున్నాడు తండ్రి. రెండో అక్కయ్య మరణసమయంలో ఆమె బంగారుకంటె మాయంకావటానికి తండ్రే కారణమని కొందరనుకున్న మాట నిజమేకాని ఒక్క వెంకమ్మే అది కళ్లారాచూసిన మనిషి. వెంకమ్మ చూసిందని తండ్రికి తెలుసు. కాని వెంకమ్మ ఆ సంగతి బైట పడనీయలేదు. ఆయన పరిస్థితి అలాంటిది. ఏమైనా పొలం తండ్రిపేర రాయటం ఆమె కిష్టంలేక పోయింది. అక్కడి నుంచి వెళ్ళిపోవటమే మార్గమని నిశ్చయించుకుంది.

ఎక్కడికి వెళ్ళుతుంది? ఏం చేస్తుంది? ఆ పల్లెటూళ్ళో తండ్రికి విడిగా వుండటం అసంభవం. ఇంకో పల్లెటూరు పోవాలి. పనిపాటలకు వెనుదీయని మనిషి కనక ఎలాగో పొట్ట పోషించుకోవచ్చు. కాని బస్తీల్లోమల్లే కాకుండా పల్లెటూళ్ళలో సాధారణంగా అంతా శరీరంవంచి పనిచేశేవాళ్ళేనాయె! కనీసం కొత్త పల్లెటూరిలో ఆమె నిస్సహాయస్థితి, సహాయపడే ఆమె స్వభావమూ తెలిసేవరకూ ఎవరూ పని చేయించుకుని ఆమె పోషణకు తోడ్పడక పోవచ్చు! కనక బస్తీ చేరటం ఉత్తమం అనుకుంది. ఇక పొలంసంగతి. తనా అక్కడ వుండి ఆ పొలం చూసుకోలేదు. అమ్మితే తండ్రికి ఆకాస్త ఆదాయమూ పోతుంది. వెంకమ్మ దీర్ఘంగా ఆలోచించి పొలంఅయివేజు తండ్రి అనుభవించేటట్టు, తాను మాత్రం వెళ్ళిపోయేటట్టు తీర్మానించుకుంది. వెంకమ్మ మేజరు - ఆమె అభిప్రాయానికి ఎదురు చెప్పే అధికారం తండ్రికి లేదు!

వెంకమ్మ ఈ వూరు చేరి ఓ శ్రీమంతుల ఇంట్లో వంటకు కుదిరింది. పల్లెటూరికీ, బస్తీకీ చాలాభేదం కనిపించింది ఆమెకు. తనకుమల్లే జీవనోపాధి కోసం వచ్చిన వాళ్ళు, చదువుల కోసం వచ్చిన వాళ్ళు, వ్యాపారరీత్యా వచ్చీపోయేవాళ్ళు బస్తీలో ఎందరో వున్నారు. పల్లెటూళ్ళలో అయితే చాతనయినంతవరకు ఒకరికొకరు ఆదుకుంటారు. బస్తీలో ఆ తీరిక వుండదు. తను వంటకు

"మీరు నన్ను అనుగ్రహించారంటే ఈ జీవితంలో ఎంతో పైకిపోతాను."

చేరినట్టుగాని, తన పేరేమిటోకాని ఇంటి యజమానికి తెలియక పోవటం వెంకమ్మకు ఆశ్చర్యం కలిగించింది. ఇంటిపనివాళ్ళ విషయంలో ఆయన ప్రమేయంలేదు. ఆ ఇంట్లో స్త్రీలకు పురుషులతో సమానత్వం లేదు – ఉన్నతాధికారమే వుంది!

నిస్సహాయురాలైన ఆడది పురుషుణ్ణి మరింతగా ఆకర్షించటం సహజం! ఇక అనాకారిదైనా "వూరికే" వున్న స్త్రీ మగవాడికి మరింత మగతనం తెప్పిస్తుంది! వెంకమ్మకి రెండు లక్షణాలూ వున్నాయి! పైగా భార్య వంటింటో ఎన్నడూ లభ్యం కాలేదో ఏమో ఆ శ్రీమంతుల పెద్దబ్బాయిగారు ఓనాడు సాయంత్రం వెంకమ్మను కాస్తా అమాంతం వాటేసుకున్నాడు. తనపట్ల ఆ పెద్దబ్బాయిగారి కింత దయాదాక్షిణ్యాలు వున్నట్టు వెంకమ్మ వూహించుకోకపోవటంవల్ల ఆమె కెవ్వున కేక వేసింది. పేరంటానికి వెళ్ళివుండాలిసిన పెద్దబ్బాయిగారి భార్య వెంకమ్మ కేక కోసమే అవతలకాసుకుని వున్నట్టుగా వెంటనే ప్రత్యక్షమయింది. తప్పంతా వెంకమ్మదే కనక ఆవిడకు మర్నాడే ఉద్వాసన ముట్టింది. వెంకమ్మ వెళ్ళిపోవటంకూడా ఇంటి యజమానికి తెలియదు!

వెంకమ్మ మరోపేటలో ఓ భాగం అద్దెకు తీసుకుంది. పూటకూళ్ళ ప్రారం

భించింది. అది ఆమెకు వృత్తికాదు—వ్యాపారంకాదు. కేవలం భుక్తికోసమే. పూటకూళ్ళతో తనజీవితం గడప గలిగితే వెంకమ్మకింకేం అక్కర్లేదు. అక్కడ బల్లలమీద కూర్చొని భోజనం చెయ్యటానికి అవకాశమేలేదు. వూళ్ళో ఆధునికపద్ధతుల్లో హోటళ్ళు అభివృద్ధి చెందుతున్నా వెంకమ్మ హోటలుకు చలనంలేదు. బస్తీ డాబులకు, నాజూకులకు మోజుపడనివాళ్ళు, పల్లెటూళ్ళ కరణాలు, కోర్టుపన్లమీద వచ్చేవాళ్ళు ఆవిడ హోటలును వెతుక్కుంటూ వస్తారు. అక్కడ మరి ఇంటిభోజనం, ఆప్యాయత లభిస్తాయి.

ఎవరో అన్నారు-కలంతో కవిత్వం రాయటందగ్గిర్నించీ నాగలితో భూమి దున్నటంవరకూ భేదంలేదనే జాతే ఉన్నత దశకొస్తుందని. కాని ఈ మధ్యలో ఎక్కడా పూటకూళ్ళు పెట్టటం వున్నట్టు కనిపించదు! ఆధునిక హోటళ్ళలో సణగటానికి అట్టే అవకాశా లుండవు. దిక్కులేని వెంకమ్మ హోటలు, దీనికెంతైనా పనికొస్తుంది. ఇంటిభోజనమూ రుచిచూడొచ్చు-ఇష్టం వచ్చినట్టు సణగనూవచ్చు వెంకమ్మ హోటల్లో! వెంకమ్మ తనను ఆదరంగా చూడటానికి క్కారణం తాను చేరిన లగ్న మహాత్యమనుకుంటూ వచ్చాడు నాగాయి. డబ్బు ఇస్తూకూడా తన భోజనాన్ని నాగాయి వంకలు పెట్టకపోవటం వెంకమ్మకు ఓ మహాభాగ్యం అయిందని ఎవ్వరికీ తెలియదు.

నాగాయి కెప్పుడూ సమయానికి డబ్బు వస్తుండేదికాదు. ఒకటో తారీకు రాగానే వెంకమ్మ వాడిని డబ్బు అడిగేది. ఒకసారి నాగాయి రెండునెలలక్కూడా డబ్బు ఇయ్యలేకపోయాడు. ఆవిడ వరసగా రెండు రోజులు డబ్బు అడిగేటప్పటికి నాగాయికి మతిపోయినట్లయింది. మూడోనాడు భోజనానిక్కూచోకముందే డబ్బు అడిగింది. డబ్బు ఇయ్యందే భోజనం పెట్టటం ఆవిడ కిష్టంలేదనుకుని నాగాయి, ఆవిడని లోపలికి పోనిచ్చి బయటికివచ్చేశాడు. ఆ రాత్రికి మరి వాడికి భోజనమేలేదు మర్నాడు ఉదయానే వెంకమ్మగారు నాగాయి గదిముందు ప్రత్యక్షమయింది. రాత్రి నాగాయి భోజనంచెయ్యలేదని తెలుసుకుంది. డబ్బు అడిగితే అతను భోజనం మానేశేటంతటి తెలివి తక్కువ వాడు అనుకోలేదన్నది. ఇందుకేనా ఈ చదువన్నది. అలా మొత్తాలు పెంచి తనకు ఎందరో ఎగేసిపోయారన్నది. ఆ ధోరణిలో ఆవిడ తన చరిత్ర నాగాయికి చెప్పేసింది. స్త్రీలో సహజంగా వుండే మాతృభావం నాగాయి మీద మరింత ప్రసరించింది. నాగాయి సినిమాల కెళ్ళితే విసుక్కోక, ఆలిస్యం లెక్కచెయ్యక

భోజనం పెట్టేది. అడగనిది అమ్మయినా పెట్టదంటారు. ఆమాట నిజమే అయితే తల్లి లేదుకనక నాగాయికి తెలియదు—వెంకమ్మ తల్లుల్ని మించినది!

నాగాయికి నాటకాలంటే ఉబలాటం అనీ, దగ్గిర డబ్బు వుండదనీ తెలుసు వెంకమ్మగారికి. ఆవిడ ఇస్తానన్నా నాగాయి భిడియపడటం చూసి తనదగ్గిర తీసుకోవచ్చునని నమ్మించేది అడిగితే డబ్బిచ్చేవాళ్ళుంటారు. కాని మనకు డబ్బు అవసరమని తెలిసినప్పుడు మాత్రం ఆ సంగతే తెలియనట్టు ప్రవర్తిస్తారు కొందరు. మనచేత అడిగించుకోవాలని వుంటుంది వాళ్ళకి. అడిగించుకోవటంలో తప్పేంలేదు. కాని వెంకమ్మగారిలా చాలా మంది సన్నిహితులుకూడా ప్రవర్తించరు. ఈ అడిగించుకోవటమైనా డబ్బులోవున్న మహత్యం ఇతరవాటిల్లో లేదని నాగాయికి బాగా తెలిసివచ్చింది. నాగాయి సాటి కాలేజీవాణ్ణి అయిదురూపాయలడగటం "దేహి" అయింది. కాని వాడే నాగాయిని కాలేజీ నోట్సు అడగటం మాత్రం "దేహి" కాలేదు! ఇక అడిగినా, వుండికూడా ఇయ్యని సన్నిహితులకంటె వెంకమ్మగారు లక్షరెట్లు నయమనిపించింది నాగాయికి!

నాగాయితోపాటు ఇంకా ఇద్దరు ముగ్గురు కాలేజీవిద్యార్థులు వెంకమ్మ హోటల్లో భోంచేశేవారు. వాళ్ళ తెలివి కాలేజీలో ఎంతవరకు పోయేదోకాని వాళ్ళ "అతితెలివి" మటుకు వెంకమ్మగారిమీద ప్రసరించేది. పిల్లిమీద, ఎలికిమీద, కూరలమీద పెట్టి వెంకమ్మను ఎగతాళి చేశేవారు. కొందరు ఎదటివాళ్ళను ఎగతాళి చెయ్యకుండా, అవమానించకుండా వుండలేరు. మరి ఎగతాళి చేశేవాడు గొప్పవాడు. ఎగతాళి పడేవాడు తక్కువవాడు! మరికొందరు బూతులతో ఎగతాళి చేస్తే తప్ప వాళ్ళఆత్మ శాంతించదు! ఈ కాలేజీ కుర్రాళ్ళు మాత్రం, వాళ్ళ ధర్మమా అని, బూతుఅర్థాలు కూడా వుండే మాటలన్నీ వాడి వెంకమ్మను అవమానించేవాళ్ళు. అదైనా అందరూ వున్నప్పుడే! ఒక్కడే వుంటే చాలా పెద్దమనిషల్లే ప్రవర్తించేవాళ్ళు. అవతలవాళ్ళని ఎగతాళి చెయ్యాలన్నా, అవమానించాలన్నా "తోడు" వుండాలని నాగాయికి వెంకమ్మగారి హోటల్లో తెలిసివచ్చింది. ఎప్పుడన్నా వెంకమ్మగారి అక్కయ్యలు వచ్చి వడ్డనలో సహాయం చేస్తుంటే వీళ్ళ పెచ్చుపెరిగేవాళ్ళు. ఆడవాళ్ళని, మరీ దిక్కులేని ఆడవాళ్ళని నీచంగా చూడటంకంటె పురుషోత్తములు చెయ్యగలిగిన ఘనకార్యం ఏముంది? ఎంతోఓర్పుగల వెంకమ్మగారు విసిగి ఒకసారి ప్రతివాడినీ బహుసున్నితంగా ఎగతాళి చేసింది. నవ్వుతూ అటు మూడు తరాలుకు ఇటు మూడు తరాలకు తగిలే

టట్టు చీవాట్లు పెట్టింది. వెంకమ్మగారు అంత మాటకారి అని అంతవరకూ ఎవ్వరూ అనుకోలేదు. అంతమందీ వుండికూడా ముఖాలు వేళ్ళాడేశారు. మరి నోరెత్తలేదు. అనాధ, అనాకారి అయిన పూటకూళ్ళమ్మ ఆ కాలేజీ కుర్రాళ్ళని భోజనాలముందు నోరు మూయించింది!

నాగాయి వెంకమ్మగారి ఇల్లు గుర్తు పట్టాడు. కాని ఆ వీధిలో చాలా ఇళ్లు మారిపోయినై. సైకిలు రిక్షాను పంపి, మూసివున్న వీధి వాకిలి తలుపుతట్టాడు. జవాబులేదు. మరోసారి తలుపు తట్టాడు. అరుగు పక్కనే గోలీలాడుతున్న కుర్రాళ్ళలో ఒకడు ఆట ఆపి "ఎవరుకావాలి?" అని అడిగాడు.

"వెంకమ్మగారు!'' అన్నాడు నాగాయి. ఆ కుర్రాడు "అమ్మా'' అని అడుస్తూ తలుపుతట్టాడు. నాగాయికి ఆశ్చర్యంవేసింది. ఇంతలో వెంకమ్మ గారు తలుపుతీసి ''ఎవరా'' అన్నట్టు చూసింది. ఆవిడ జీవితంలో కరడుకట్టుకున్న విషాదం అంతా ఒక్కసారి కన పడింది ఆ ముఖంలో. కాని నాగాయిని చూడగానే ఆవిడ ముఖం మారిపోయింది.

''గుర్తువున్నానా?'' అన్నాడు నాగాయి. ఆవిడ ఎగాదిగాచూసి ''నువ్వా-రా!'' అని ఓ పీట తెచ్చివేసింది. ఆవిడ అడిగిన ప్రశ్నలకు అంతులేదు. నాగాయి భార్య, పిల్లలు మొదలైన విషయాలన్నీ సవిస్తరంగా తెలుసుకుంది. ఆవిడ ఒకప్పటి అభిమానమే నాగాయికి ఇప్పుడు చాదస్తమనిపించింది!

''ఇంతకూ ఏంపనిమీద వచ్చావు?"

''ఇవాళ మా నాటకం వుంది. మిమ్మల్ని పిలవటానికి వచ్చాను!''

"నా జీవితమే నాటకం! నువ్వు వేషంవేస్తావా ఏమిటి?

"ఏదో! తప్పుతుందా?''

''నాటకాలు చూడ్డంమానేసి ఇప్పుడు వేషాలే వేస్తున్నావూ! భేష్!''

"ఇందాక ''అమ్మా'' అని పిలిచిన కుర్రాడెవరు?"

''నా తమ్ముడి నాలుగో కొడుకు - నేను పెంచుకున్నానులే! వాడు నాలుగు రోజుల్నించి నాటకానికి డబ్బు ఇయ్యమని వేధించుకు తింటున్నాడు - ఈ నాటకానికే కామాలు! వాడినిమటుకు తీసుకుపో బాబూ - నీకు పుణ్యం వుంటుంది!''

''అతనే ఏమిటి - మీరూ రావాలి. నేను మీకోసమేవస్తా!''

''ఎలా బాబూ? ఎవరైనా ఆలిస్యంగా వస్తే భోజనం ఎవరు పెడతారు?" అవతల దొడ్డి వాకిలి మధ్యలో ఇద్దరు స్త్రీలు నిలుచుని చూడటం కనిపించింది నాగాయికి.

"ఎవరో వున్నారే!'' అన్నాడు నాగాయి. వెంకమ్మ తొంగిచూసింది.

''మా పెద్దక్కయ్య! చూసి పోదామని వచ్చింది. నెలరోజు లయిందిలే! ఆ పొట్టిది మూడో అక్కయ్య. పాపం దాని మొగుడు పోయినాడు. అదీ, ముగ్గురు పిల్లలూ ఇక్కడే వుంటున్నారు. నీవు ఇదివరకు చూశావు—గుర్తు పట్టలా ?''

''వాళ్ళు సాయం చెయ్యరూ ఈ వక్కరోజు ?''

"నాటకం అంటే వాళ్ళూ వస్తానంటారేమో !"

''నాకదంతా తెలియదు. మీరు మటుకు రాక తప్పదు. రాత్రి తొమ్మిదింటికి బండి పంపుతాను. సిద్ధంగా వుండండి !''

''మా నాన్న, అమ్మ ఎలా ? వాళ్ళక్కడే వుంటున్నారు !"

"ఎన్నాళ్ళనుంచి ?'' నాగాయికి ఇంకా ఆశ్చర్యం వేసింది.

''ఏడేళ్ళు దాటిందేమో !'' అంది వెంకమ్మగారు.

"ఏరీ ?''

''దొడ్లో వున్నారు! మా అమ్మకు వినపడదు. మా నాన్నకు కనపడదు, వినపడదు !'' అంది వెంకమ్మగారు.

నాగాయి మెల్లిగా దొడ్డివాకిలి దగ్గిరికి వెళ్ళాడు. బాదంచెట్టుకింద నులకమంచం మీద ఓ పండు ముసలాయన పడుకుని వున్నాడు. పక్కనే చాపమీద ఓ ముసలావిడ కూచుంది.

"మీ తమ్ముడేం చేస్తున్నాడు ?"

"ఆ వూళ్ళోనే మేష్టరు పని చేస్తున్నాడు.''

''మీ నాన్న, అమ్మ అక్కడ వుండ రాదా ?'' అన్నాడు నాగాయి ధైర్యంచేసి.

"వాళ్ళ కక్కడ తోచదు. అయినా ఎక్కడ వుంటే నేం ? అదీకాక కోడళ్ళు కాపరానికి వచ్చిం తర్వాత కొడుకులు మాట వింటారా — నీకేం తెలుస్తుంది !" అన్నది వెంకమ్మగారు నవ్వుతూ. ఆ విషయం రుజువు చెయ్యటానికి వాళ్ళ నాన్నకూడా లేడు!

''మీ నాన్నగారు కులాసా ?'' అంది వెంకమ్మగారు.

"లేరు — మూడేళ్ళయింది పోయి!"

"అందుకే నువ్వు నాటకాల్లో దిగావు!" అంది వెంకమ్మగారు. నిజానికి తండ్రి పోయిన తర్వాతే నాగాయి లాయరు — ప్రొడ్యూసరు — డైరెక్టరు — నటుడు అయింది!

"మీరు అందరికన్న ముందు సోఫాలో కూర్చుని, మా నాటకం చూడాలి !'' అని స్పష్టంగా చెప్పి నాగాయి హాలు దగ్గిరికి బైలుదేరాడు. మరి వెంకమ్మగారు నాగాయి వాళ్ళ నాటకానికి నాయకురాలు. కాని జీవితానికి సాహిత్యం ప్రతిబింబం కావాలి అన్న సూత్రప్రకారం నాటకంలో మార్పులు చెయ్యాలా వద్దా అని నాగాయి కిప్పుడొక తీరని సమస్య పట్టుకుంది. నన్నడుగుతాడు — నేనేం చెప్పగలను!

★